VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఫిబ్రవరి 25 మంగళవారం2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 216

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

## రాష్ట్రవ్యాప్తంగా...

### కదంతొక్కిన కలం కార్మికులు.

కలెక్టరేట్ల వద్ద నిరసన ప్రదర్శనలు

కలెక్టర్లకు వినతి పత్రాలు

హైదరాబాద్ లో సమాచార భవన్ ఎదుట నిరసన.

ఇండ్ల స్థలాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్.

# ప్రజలు తిరస్కరించినా.... ఫాం హౌస్ నుండి ప్రభుత్వంపై కుట్రలు.

దేశంలో ఏడాదికి రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని యువతను మభ్యపెట్టి కేంద్రంలో పగ్గాలు చేపట్టిన ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణలో రెండే ఉద్యోగాలిచ్చారు. వాటిలో ఒకటి బండి సంజయ్‌కి, మరొకటి కిషన్‌రెడ్డికి దక్కాయి. అదే మేం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే రాష్ట్రంలోని 55,163 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చాం.



2లో



ఏడాదిలోగా ఉద్యోగ విరమణ బకాయిలు కేంద్రంతో మేం తలపడేందుకు ప్రయత్నిస్తుంటే కేసీఆర్ వెనక్కిలాగే ప్రయత్నం చేస్తున్నారు. భారాస పదేళ్ల నిర్వాకంతోనే ఉద్యోగ విరమణ చేసిన వారికి చెల్లించాల్సిన బకాయిలు రూ.8 వేల కోట్లకు పేరుకుపోయాయి. వారికి ప్రస్తుతం నెలకు రూ.300 కోట్లు విడుదల చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా ఏడాదిలోపే బకాయిలన్నీ చెల్లిస్తాం.

- బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం.
- కేటీఆర్, హరీశ్ రావుకు బండి సంజయ్, కిషన్ రెడ్డి అండ.
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని గెలిపించాలి.
- పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్ రెడ్డి.

## వెంటనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి




**పార్టీలో, రాష్ట్ర ప్రభుత్వంలో మహిళా కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ లను కోరుతానని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా తెలిపారు.**

హైదరాబాద్: పార్టీలో, రాష్ట్ర ప్రభుత్వంలో మహిళా కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లను కోరుతానని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ లక్షకు పైగా సభ్యత్వాలు చేయించి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన సందర్భంగా సోమవారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అధ్యక్షతన నారీ న్యాయ్ సమ్మేళన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్కా లాంబా హాజరై రాష్ట్ర కార్యవర్గాన్ని సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. "దేశవ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ సభ్యత్వాలు 5 లక్షలు కాగా.. ఒక్క తెలంగాణలోనే లక్షా మూడు వందలు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు దిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నేతలను ప్రియాంకాగాంధీ సత్కరిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మహిళా కాంగ్రెస్ పనిచేయాలి. ఎక్కువ సభ్యత్వాలు చేయించిన జిల్లాలను గుర్తించి, సభ్యత్వ రుసుముతో వచ్చిన డబ్బులతో వారికి న్యాప్‌కిన్ తయారీ మిషన్లు అందజేసి ఉపాధి కల్పిస్తాం" అని అల్కా లాంబా వివరించారు. చట్టసభల్లో మహిళలకు కేటాయించనున్న 33 శాతం సీట్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కాంగ్రెస్ నాయకురాలు ఇందిరాశోభన్ అల్కా లాంబాకు వినతిపత్రం ఇచ్చారు.



## ప్రమాదాన్ని గాలికొదిలేసి.. ఎన్నికల ప్రచారమా?

హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలి 8 మంది ఆచూకీ తెలియని విపత్కర పరిస్థితుల్లో.. ప్రమాద ఘటనపై చర్యలను గాలికొదిలేసి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగితేలుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. జరిగిన దుర్ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రికే సీరియస్‌నెస్ లేకపోతే.. ఇక అధికార యంత్రాంగానికి ఎక్కడ ఉంటుందని సోమవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. "ఓట్ల వేటలో జిల్లాలు చుట్టివచ్చేందుకు ముఖ్యమంత్రికి సమయం ఉంది కానీ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు వెళ్లే టైమ్ లేదా? ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ప్రాణాలకు ఇచ్చే విలువ ఇదేనా? బాధితుల కుటుంబాలకు భరోసా ఇవ్వాల్సిన కనీస మానవత్వం కూడా లేదా? ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి.. పట్టభద్రులకు గాలం వేసేందుకు సిద్ధమైన సీఎంను ప్రజలు గమనిస్తున్నారు. సరైన సమయంలో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెడ్తారు" అని కేటీఆర్ పేర్కొన్నారు.



2లో

### ఇరు రాష్ట్రాలు తేల్చుకోండి

ఇరురాష్ట్రాల సీటాలు నిర్ణయానికి రావాలి

నీటి పంపకాలపై కేఆర్ఎంబీ వెల్లడి

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం

### రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

3 రోజులపాటు వైన్స్ షాపులు, బార్లు బంద్

2లో



## షెడ్యూల్ వచ్చేసింది

- ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- మార్చి 3న నోటిఫికేషన్, 20న ఎన్నికలు
- మార్చి 10 నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- మార్చి 20న పోలింగ్, ఓట్ల లెక్కింపు

2లో








2లో

### మేడిగడ్డ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు

తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

## భారత్ మాటలే కాదు..చేతల్లో చూపిస్తున్నాం

వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశం

ప్రపంచ బ్యాంక్ వ్యాఖ్యలను గుర్తు చేసిన ప్రధాని

గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ

భోపాల్:భారత్ మాటలకే పరిమితం కావడం లేదని, చేతల్లోను చూపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఆర్థికరంగంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా కొనసాగు తోందని ప్రపంచ బ్యాంకు చెప్పిందని గుర్తుచేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతోన్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సోమవారం మాట్లాడిన ఆయన.. సదస్సులో పాల్గొన్న వారికి క్షమాపణలు తెలియజేశారు. తాను ఆలస్యంగా రావడానికి గల కారణాన్ని చెప్పారు. 10,12 తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్ష ప్రారంభమయ్యే సమయం.. నేను రాజ్‌భవన్ నుంచి బయల్దేరే సమయం ఒకటే. అప్పుడు నేను వస్తే భద్రతా కారణాల దృష్ట్యా ట్రాఫిక్ జామ్ కావొచ్చు. దాంతో విద్యార్థులు ఇబ్బందిపడే అవకాశం ఉంది. అందుకే వారంతా పరీక్షా కేంద్రాలకు వెళ్లిన తర్వాత రాజ్‌భవన్ నుంచి బయల్దేరాలనుకున్నాను. దాంతో 15-20 నిమిషాలు ఆలస్యమైంది. ఇక్కడ మీకు అసౌకర్యం కలిగించినందుకు క్షమాపణలు కోరుతున్నానని మోదీ మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచం ఆశాభావంతో ఉందని మోదీ అన్నారు. జనాభాపరంగా మధ్యప్రదేశ్ ఐదో అతిపెద్ద రాష్ట్రం. వ్యవసాయం, ఖనిజాల పరంగా ముందువరుసలో ఉంది. రెండు దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో ఎన్నో మార్పులు సంభవించాయి. ఇక్కడ భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం సుపరిపాలనపై దృష్టిసారించింది. 20 సంవత్సరాలకు ముందు ఇక్కడికి రావాలంటే పెట్టుబడిదారులు ఆలోచించేవారు. కానీ ఇప్పుడు పెట్టుబడుల పరంగా ముందువరుసలో ఉంది. అలాగే సౌరశక్తిలో భారత్ సూపర్ పవర్‌గా మారిందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఓ విభాగం కీర్తించింది. ఇతర దేశాలు మాటలతో ఆగిపోతుంటే..

భారత్ చెప్పింది చేసి చూపించిందని ఆ సంస్థే పేర్కొంది. ఈ వ్యాఖ్యలు పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. మంగళవారం కూడా ఈ సమ్మిట్ జరగనుంది. దీనికి 60 దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ఆయా దేశాల దౌత్యవేత్తలు పాల్గొన్నారు. భారత వ్యాపారరంగ ప్రముఖులు కుమార్ మంగళంబిర్లా, గౌతమ్ అదానీ, నాదిర్ గోద్రెజ్ తదితరులు హాజరయ్యారు.



# రాష్ట్రవ్యాప్తంగా...కదంతొక్కిన కలం కార్మికులు.

వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి 24:
దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. సోమవారం అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించారు.
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయా జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాల వద్ద జర్నలిస్టుల నిరసన కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ నాయకులు ఆయా జిల్లాల కలెక్టర్లకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు సమర్పించారు. రాష్ట్రవ్యాపిత ఆందోళనలో భాగంగా హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్ లో గల రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ కార్యాలయం(సమాచార భవన్)వద్ద జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుండా అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సమస్యలను



పరిష్కరించకుండా జాప్యం చేస్తుందని ధ్వజమెత్తారు. సుప్రీం కోర్టు తీర్పు సాకుతో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం,కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇంత వరకు ఇవ్వకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం దుర్మార్గమని అన్నారు. జర్నలిస్టుల పట్ల గత ప్రభుత్వ మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా చిన్న చూపు చూడకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, కొత్త అక్రెడిటేషన్ కార్డులు, చిన్న, మధ్య తరహా పత్రికలకు ఎంపానెల్మెంట్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని, హెల్త్ కార్డులు లేక, వైద్య సదుపాయాలు అందక రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఐదు వందల మంది జర్నలిస్టులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఆరోగ్య భీమా పథకం, పెన్షన్ స్కీం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమాచార పౌరసంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్ కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ ఎస్. హరీష్ ను కలిసి వినతి పత్రం సమర్పించి సమస్యలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో

ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, గుడిగ రఘు, కార్యదర్శులు ఎస్ కే సలీమా, కార్యవర్గ సభ్యులు కె. పాండురంగారావు, పి.నాగవాణి, మణిమాల,నాయకులు యర్రమిల్లి రామారావు, శ్రీనివాస్ గౌడ్, రవికుమార్, సీహెచ్ రంగయ్య పాల్గొన్నారు.

# షెడ్యూల్ వచ్చేసింది

హైదరాబాద్: తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. తెలంగాణలో ఐదుగురి ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. మార్చి 29 నాటికి ఐదుగురి ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. తెలంగాణలో పదవీకాలం ముగిసే వారిలో సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్?లు బీఆర్?ఎస్? నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎగ్గె మల్లేశం మాత్రం కొద్ది నెలల క్రితమే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మీర్జా సహన్ ఎమ్?ఐఎమ్? నుంచి ఎమ్మెల్సీలుగా ఉన్నారు. తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల సంఖ్య బలాన్ని పరిశీలిస్తే ఈ ఎన్నికల్లో నాలుగు సీట్లను అధికార కాంగ్రెస్, ఒక స్థానాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ దక్కించుకునే అవకాశం ఉంది. తెలంగాణలోనూ ఐదుగురు ఎమ్మెల్సీలు పదవీ కాలం ముగుస్తోంది. మహమ్మూద్ ఆలీ, సత్యావతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, యగ్గే మల్లేశం, మీర్జా రియాజుల్ హస్సేన్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. వీరిలో నలుగురు బీఆర్ఎస్ కు చెందిన వారు.. ఒకరు మజ్లిస్ కు చెందిన వారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు దక్కనున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీలో బలా బలాల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ఒక సీటును మజ్లిస్ సాయంతో గెలుచుకోవచ్చు.

# ప్రజలు తిరస్కరించినా....ఫాం హౌస్ నుండి ప్రభుత్వం పై కుట్రలు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ప్రజలు తిరస్కరించినా బిఆర్ఎస్, ఫాం హౌస్ నుండి ప్రభుత్వం పై కుట్రలు చేస్తున్నారని, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందంతో తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో రేవంత్ రెడ్డి పాల్గొని, ప్రసంగించారు. బిఆర్ఎస్ రాష్టాన్ని అప్పుల కుప్పగా మార్చి, అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అన్ని వర్గాల ప్రజల్ని మోసగించారని అన్నారు. 10 నెలల పాలనలో కాంగ్రెస్ ఏమీ చేయలేదని అంటున్న బీఆర్ఎస్ వాళ్లు తమ పదేళ్ల పాలనలో ఏం చేశారోచెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూ కోచింగ్ సెంటర్ల చుట్టూ పదేళ్లు తిరగడానికే సరిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ ఇచ్చినట్టే ఇచ్చి వాళ్లే కోర్టులకు వెళ్ళి ద్రోహానికి పాల్పడ్డారని అన్నారు. ఎంతో మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో 55,163 ఉద్యోగాలను భర్తీ చేశామని, ఇందులో 11వేల టీచర్లు, 15వేల పోలీసులు, 6వేల మెడికల్ సిబ్బందితో పాటు



ఇతర ఉద్యోగాలను భర్తీ చేసిందని అన్నారు. ఇన్ని చేశాం కాబట్టే తాము పట్టభద్రులను ఓట్లు అడుగుతున్నామన్నారు. టీచర్ల బదిలీలు, ప్రమోషన్లను పూర్తి చేశామని, తండాలు, గూడెంలలో టీచర్లను భర్తీ చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. టాటా కంపెనీతో ఒప్పందం చేసుకుని 65 ఐటీఐలను అడ్వాన్సడ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రే చేశామని, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని దేశంలో ఎక్కడా లేని విధంగా పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రారంభించామని, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివరిటీని ప్రారంభించామని వివరించారు. కానీ కాంగ్రెస్ ను ఓడించాలంటున్న బీఆర్ఎస్ వాళ్లు ఎవరికి ఓటు వేయాలో చెప్పడం లేదన్నారు. అభ్యర్థి లేని ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ నిలిచిందన్నారు.

**బండి సంజయ్, కిషన్ రెడ్డిలవి సొల్లు మాటలు.**

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా సొల్లు మాటలతో ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కుల గణన తో దేశానికి ఆదర్శంగా నిలిచినా తనను తప్పు పడుతున్న బీజేపీ నాయకులు, 12 ఏళ్ళుగా కేంద్రంలో అధికారంలో ఉండి బీసీ లకు ఎం చేశారో చెప్పాలని అన్నారు. కులగణన ఎందుకు చేయలేదో బండి సంజయ్ సమాధానం చెప్పాలని, బీజేపీ నేతల లెక్కలు తప్పని, బిసి ల పొట్ట గొడుతున్నారన్నారు.
బీజేపీ నాయకులు, బిఆర్ఎస్ తో చీకటి ఒప్పందం చేసుకొని వారిని కాపాడుతున్నారని అన్నారు.

**పట్టభద్రులకు నరేందర్ రెడ్డి వారధిగా..**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడినా ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ లేదని, కానీ పట్టభద్రులు, రైతులు, ఉద్యోగుల తరఫున శాసన మండలిలో మాట్లాడే వ్యక్తి లేకుండా పోతారని రేవంత్ రెడ్డి అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యావేత్త అయిన నరేందర్ రెడ్డిని తమ పార్టీ తరఫున బరిలోకి దించామన్నారు. ప్రభుత్వానికి మధ్య వారధిలా అయన పని చేస్తారని, అందువల్ల విద్యావంతులు ఆలోచించి, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# 43 శైవక్షేత్రాలకు 3,000 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్,:మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు వెళ్లేందుకు 43 శైవక్షేత్రాలకు 3,000 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్రత్యేక బస్సులు ఫిబ్రవరి 24 నుంచి ఫిబ్రవరి 28 వరకూ అందుబాటులో ఉంటాయని భక్తులకు తీపి కబురు చెప్పింది. శ్రీశైలానికి 800, వేములవాడకు 714, ఏడుపాయలకు 444, కీసరగుట్టకు 270, వేలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సులతోపాటు అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప ఆలయాలకు సైతం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించింది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లాలనుకునే భక్తులకు ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేబీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయని టీజీఎస్?ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సుల టికెట్ ధరలను 50 శాతం




వరకూ పెంచినట్లు ఆయన వెల్లడించారు. అయితే సాధారణ సర్వీసుల టికెట్ ఛార్జీలలో ఎలాంటి మార్పులు చేయలేదని సజ్జనార్ పేర్కొన్నారు. మరోవైపు ఏడుపాయలకు వెళ్లే ప్రత్యేక బస్సులకు సవరించిన ఛార్జీలు ఫిబ్రవరి 26- 28 మధ్య వర్తిస్తాయని ఆయన తెలిపారు. గత శివరాత్రి కంటే ఈసారి ఆర్టీసీ యాజమాన్యం 809 అదనపు ప్రత్యేక బస్సులను నడుపుతోందని చెప్పుకొచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ ప్రత్యేక సేవలను ఉపయోగించి దేవాలయాలకు సురక్షితంగా వెళ్లి దర్శనం చేసుకోవాలని సజ్జనార్ ఆకాంక్షించారు. అయితే మహాశివరాత్రి ప్రత్యేక బస్సులలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం అమలులో ఉంటుందని సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. వెబ్‌సైట్‌లో బస్ టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చని చెప్పారు. మహా శివరాత్రి ప్రత్యేక బస్సుల గురించి మరిన్ని వివరాల కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సజ్జనార్ సూచించారు.

# ఇరు రాష్ట్రాలు తేల్చుకోండి

హైదరాబాద్: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక, అత్యవసర సమావేశం జరిగింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నీటి వాటాలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో హైదరాబాద్ జలసౌధలో సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శితో బోర్డు ఛైర్మెన్ సమావేశానికి హాజరయ్యారు.ప్పటికే ఏపీ ఎక్కువ నీటిని వినియోగించుకున్నందన్న తెలంగాణ శ్రీశైలం నుంచి ఏపీ నీటి వినియోగాన్ని పూర్తిగా ఆపాలని డిమాండ్ చేసింది. నీటి అవసరాలపై ఇరురాష్ట్రాల సీఈలు నిర్ణయానికి రావాలన్న కేఆర్ఎంబీ సాగర్ కింద పంటల దృష్ట్యా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ప్రస్తుత ఏడాది కృష్ణా జలాల్లో తెలంగాణకు 131, ఆంధ్రప్రదేశ్ కు 27 టీఎంసీలు మిగిలి ఉన్నాయని ఇటీవల బోర్డు తేల్చింది. ఈ నెల11 వ తేదీ వరకు నాగార్జున సాగర్?లో 510 అడుగుల పైన 63, శ్రీశైలంలో 834 అడుగుల పైన 30 టీఎంసీల నీరు మిగిలి ఉంది. రెండు జలాశయాల్లో నీటి నిల్వలు, జూన్ – జూలై వరకు తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని వివిధ ఔట్ లెట్ల నుంచి నీరు తీసుకునే ప్రణాళిక వివరాలు ఇవ్వాలని రెండు రాష్ట్రాలను ఇప్పటికే బోర్డు కోరింది. అటు ఆంధ్రపదేశ్ ఎక్కువ నీటిని ఉపయోగించుకుంటోందని, తెలంగాణ ప్రభుత్వం బోర్డు కేంద్ర ప్రభుత్వానికి కొన్ని రోజులు క్రితం ఫిర్యాదు చేసింది.

## మేడిగడ్డ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు

హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన ఘటనలో భూపాలపల్లి జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్? రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. దీంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడానికి నాసిరకమైన నిర్మాణంతో పాటు సరైన డిజైన్ లేకపోవడమే కారణమంటూ భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి భూపాలపల్లి లోయర్ కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని లోయర్
కోర్టు కొట్టివేయడంతో జిల్లా న్యాయస్థానంలో రాజలింగమూర్తి క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. రాజలింగమూర్తి
పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జిల్లా కోర్టు కేసీఆర్, హరీశ్?రావుతో కలిపి ఆరుగురికి నోటీసులను జారీ చేసింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా కోర్టుకు పరిధి లేకున్నా పిటిషన్‌ను విచారణకు స్వీకరించిందని సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు ఇది విరుద్ధమని కేసీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గత విచారణ సందర్భంగా జిల్లా కోర్టు ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. ఫిర్యాదుదారు రాజలింగమూర్తి గత వారం హత్యకు గురయ్యాడు. విచారణ సందర్భంగా ఈ విషయం హైకోర్టులో ప్రస్తావనకు వచ్చింది. జిల్లా కోర్టులో ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతి చెందిన తర్వాత ఇక ఆ పిటిషన్‌ను ఎలా విచారిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా పిటిషన్‌ను విచారించొచ్చని వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పును చదివి వినిపించారు.

# మానసిక క్షోభలో రాష్ట్ర ఉద్యోగులు

హైదరాబాద్: రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేయడం ఎంతవరకు న్యాయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో 14 నెలల కాంగ్రెస్ పాలన అసంతృప్తిగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువత, పెన్షనర్లు, కళాశాలల యాజమాన్యాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, నిర్లక్ష్య ధోరణిపట్ల భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. 14నెలల మీ పాలనలో ఆయా వర్గాలేవీ సంతృప్తిగా లేరనేది నిస్సందేహమని, ఎన్నికల్లో వారికి ఇచ్చిన హామీలను సైతం మీరు ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నారంటూ ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. వాళ్లకు దక్కాల్సిన న్యాయమైన హక్కులను కూడా కాలరాస్తున్నారని, ఆఖరుకు ఉద్యోగులకు, పెన్షనర్లకు రొటీన్‌గా అందాల్సిన చెల్లింపులను, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను కూడా చెల్లించకుండా జాప్యం చేస్తూ వారిని తీవ్రమైన మానసిక ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని ఆయన లేఖలో పేర్కొన్నారు. పెండింగ్ డీఏలు, జీపీఎఫ్ బకాయిలు, మెడికల్ బిల్లులు, గ్రాట్యుటీ పెన్షన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పేరుతో ఉద్యోగులు, పెన్షనర్లకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడమనేది ప్రభుత్వ పాలనలో రొటీన్‌గా జరిగే వ్యవహారమన్నారు. కానీ

వాటిని కూడా మీరు చెల్లించకపోవడంవల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.8,200 కోట్లు బకాయి పడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పట్ల మీరు అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని, ప్రభుత్వాన్ని నమ్ముకుని నిజాయితీగా పనిచేసే ఉద్యోగుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో, వారికి మీరు ఏ సందేశం ఇవ్వదలచుకున్నారో ఒక్కసారి ఆలోచించండన్నారు. అంతేకాకుండా..'ఇంకా బాధాకరమైన విషయమేమిటంటే గత ఏడాది 2024లో 8 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. ఈ ఏడాది మరో 10వేల మంది రిటైర్ కాబోతున్నరు. వారికి పదవీవిరమణకు సంబంధించిన ప్రయోజనాలను రూ.11 వేల కోట్ల రూపాయలు చెల్లించాలి. నేటి వరకు ఒక్కరికి కూడా చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసం అని అన్నారు. జీతం పైసల నుండి సొంతంగా జీపీఎఫ్‌లో దాచుకున్న సొమ్మును కూడా చెల్లించక పోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిత్యం మంత్రుల పేషీల చుట్టూ, అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు.

దశాబ్దాల తరబడి ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులకు మీరిచ్చే ప్రతిఫలం ఇదేనా? ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో మీరు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపూరిత విధానంతో తీరుతో లక్షలాది విద్యార్థులు, వందలాది మంది కళాశాలల యాజమాన్యాలు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. రాష్ట్రంలో ఇంటర్ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ వంటి కోర్సులను చదువుతున్న దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారు. కానీ గత బీఆర్ఎస్ పాలకులు గానీ, ప్రస్తుతమున్న మీ ప్రభుత్వం కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడంవల్ల దాదాపు రూ.7,500 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి.

## మిర్చి రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్
### కనీస ధర రూ. 11,781కు పెంపు

అమరావతి: ఏపీలో మర్చిధరలు పడిపోవడంతో రైతుల్ని ఆదుకోవడానికి కేంద్రాన్ని చంద్రబాబు రంగంలోకి దించారు. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కనీస ధరను రూ. రూ. 11,781 గా నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. క్వింటా మిర్చికి ఈ ధర వర్తిస్తుంది. ధరలు భారీగా పడిపోవడంతో రైతులు నష్టానికి అమ్ముకుంటున్నారు. ఇక నుంచి సాగు ఖర్చు.. అమ్మకపు వ్యయం మధ్య వ్యత్యాన్ని కేంద్రం చెల్లిస్తుంది.వ్యవసాయ ఉత్పత్తుల ధరలు బాగా పడిపోయినప్పుడు, రాష్ట్రాలు సాయం కోరితే మద్దతు ధర పథకాల పరిధిలోకి రాని వ్యవసాయ ఉత్పత్తులను కేంద్రం సేకరిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఆ నష్టాలను భరిస్తుంది. దీనికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అని పేరు పెట్టారు. కేంద్రం గిట్టుబాటు ధర ప్రకటించే వాణిజ్యపంటల జాబితాలో మిర్చి చేర్చకపోవడం వల్ల మిర్చికి ఈ ఫథకాన్ని అమలు చేస్తున్నారు. ఎగుమతులు కేంద్రం చేతిలోనే ఉంటాయి కాబట్టి..ఎగుమతి విధానంపై కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకుంటే డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఏపీలో దాదాపు 4 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే 1.40 లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లుగా ప్రభుత్వ వర్గాలుచెబుతున్నాయి. ఎకరాకు రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షలు పెట్టుబడి ఖర్చులవుతాయి. ఓ ఏడాది క్వింటాల్ గరిష్టంగా రూ.26 వేల వరకు వెళ్లడంతో రైతులు ఈసారి కూడా అధిక ధరలు వస్తాయన్న భావనతో భారీగా సాగు చేశారు. 2024 మార్చి తర్వాత ధర రూ.20వేల నుంచి సగానికి పడిపోవడంతో రైతులు మళ్లీ ధరలు పెరుగుతాయనే ఆశతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు.

# రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

**హైదరాబాద్,:** తెలంగాణలోని మందు బాబులకు షాకింగ్ న్యూస్. రేపట్నుంచీ మూడు రోజులు పాటు వైన్స్ షాపులు, బార్లు క్లోజ్ చేయనున్నారు. ఫిబ్రవరి 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27న సాయంత్రం 4 గంటల వరకు లిక్కర్ షాపులు మూసివేయనున్నారు. మెదక్ %-% నిజామాబాద్ %-% ఆదిలాబాద్ %-% కరీంనగర్ లలో గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండగా.. నల్గొండ %-% ఖమ్మం %-% వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగనున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా పోలింగ్ జరిగే ఉమ్మడి ఏడు జిల్లాల పరిధిలో మద్యం దుకాణాలు బంద్ అవుతాయి. ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు పోలింగ్ జరగనుండగా, మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనుంది ఈసీ. హైదరాబాద్ లోని కొన్ని ప్రాంతాల్లో మినహా మిగిలిన చోట మద్యం షాపులు యథాతథంగా తెరుచుకుంటాయి. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కారణంగా కేవలం కొల్లూరు, ఆర్సీ పురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ మూడు రోజులపాటు మద్యం దుకాణాలు క్లోజ్ కానున్నాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా మద్యం విక్రయించినా, మద్యం సరఫరా చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మద్యం షాపుల నిర్వాహకులను పోలీసులు హెచ్చరించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధి లోని కొన్ని పోలీస్ స్టేషన్లు సైతం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి వస్తాయని

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# జర్నలిస్టుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 24**



రాష్ట్రంలో జర్నలిస్ట్ లు పరిస్థితి దారుణంగా మారాయని అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో బ్రతుకులు ఈడుస్తున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం టి డబ్ల్యూజెఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ చాంబర్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యదర్శి రాంచందర్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వమే రివ్యూ పిటిషన్ వేసి వాదనచేసి జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు కొత్త ఆరోగ్య భీమా పథకాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగుల మాదిరిగా అమలు చేయాలని జర్నలిస్టుల కంట్రిబ్యూషన్ ప్రభుత్వం భరించాలని కోరారు. కొత్త అక్రిడేషన్ కార్డులు అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, రెండుసార్లు వాయిదా వేసింది అని వెంటనే జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరి జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు.

**ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలి.**
**దాడులు అరికట్టేలా ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి.**
**టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యదర్శి రాంచందర్ డిమాండ్.**
**జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కు వినతి పత్రం.**

జర్నలిస్టులపై అరికట్టాలని ఇందుకోసం ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని కోరారు. అర్హత ఉన్న చిన్న మధ్య తరహా పత్రికలను ఎంపానెల్మెంట్లో చేర్చాలని కోరారు. వార్తల సేకరణకు కలెక్టరేట్కు వచ్చే జర్నలిస్టుల కోసం కలెక్టరేట్లో ఒక ప్రత్యేక గది కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు అడవల అనిత, జర్నలిస్ట్ నాయకులు మీస మధు, కోరి రాకేష్, రాజేందర్, దూడ కృష్ణ, అమంద్ ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి.

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 24**



: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. వారోత్సవాలను పురస్కరించుకుని లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడప్రతులను సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్థిక అక్షరాస్యత కింద జిల్లాలో చేపట్టే కార్యక్రమాల గురించి అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలాన్నారు. ప్రధానంగా పొదుపు పై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేయాలని, అవగాహన ర్యాలీలు, వినియోగదారులతో ఆర్థిక అక్షరాస్యత సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో జెడ్పి సీ.ఈ.ఓ సాయాగౌడ్, నాబార్డు డీడీఎం ప్రవీణ్, మెప్మా పీ.డీ రాజేందర్, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త డైట్ మెనూ అమలు చేయాలి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**వేగుచుక్క న్యూస్, కామరెడ్డి, ఫిబ్రవరి 24:**



ప్రభుత్వం ప్రకటించిన కొత్త డైట్ మెనూ అమలు పరచాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వసతి గృహాలు, రెసిడెన్షియల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫుడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన కొత్త డైట్ మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. అలాగే శుద్ధమైన త్రాగునీరు సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. కూరగాయలు, పప్పు దినుసులు, బియ్యం నాణ్యత గల సరుకులు కాంట్రాక్టర్ నుండి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రుచికరమైన భోజనాన్ని వండిన వెంటనే రుచి చూసిన తరువాత పిల్లలకు పెట్టాలని తెలిపారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు ను ప్రత్యేక అధికారులు తనిఖీ చేయడం జరుగుతుందని, హైజనిక్ భోజనం మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. వసతి గృహాల్లో అవసరమైన పనుల ప్రతిపాదనల మేరకు పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వి. విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ, బి.సి., మైనారిటీ సంక్షేమ అధికారులు రజిత, స్రవంతి, దయానంద్, ఫుడ్ సేఫ్టీ అధికారిని శిరీష్, తదితరులు పాల్గొన్నారు.

# సిద్దుల గుట్ట సాక్షిగా ఇచ్చిన హామీలు ఏమైనాయి..?

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్ :**




ఉమ్మడి కరీంనగర్, నిజామాబాదు, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల మరియు టీచర్ ఎమ్మెల్సి ఎన్నికల్లో భాగంగా చంద్రశేఖర్ కాలనీలోని రీజినల్ లైబ్రరీలో అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాదు జిల్లాకు ఏ మొఖం పెట్టుకొని వస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. జాబ్ క్యాలండర్ ద్వారా ప్రభుత్వం ఇస్తానన్న 2 లక్షల ఉద్యోగాలలో నిజామాబాదు యువతకు ఎన్ని ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించారో సమాధానం చెప్పాలన్నారు, నిరుద్యోగులకు ఎంత మందికి 4వేల భృతి ఇచ్చారో, ఎంత మంది నిజామాబాదు ఆడపడుచులకు 2500 ఇచ్చారో, ఎంత మంది 18 సం" నిండిన ఆడబిడ్డలకు ఎలక్ట్రికల్ స్కూటీలు ఎన్ని ఇచ్చారో రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు.

6 వేల కోట్ల ఫీ రియంబర్స్మెంట్ బకాయి కారణంగా ఎస్సి, ఎస్టి , బీసీ పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువులకు దూరం అయ్యే దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో హిందూ దేవుళ్ళపైన ప్రమాణాలు చేసి ఇచ్చిన హామీలను ఏ గంగలో కలిపారని ప్రశ్నించారు, సిద్దుల గుట్ట మీద ఒట్టు పెట్టి ఇప్పటివరకు ఒక్క హామీ నెరవేర్చకుండా ఏ మొఖం పెట్టుకొని నిజామాబాదుకు ఓటు అడగటానికి వచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు.

తెలంగాణ రాష్ట్రాసాధనకు అమరులైన ఉమ్మడి నిజామాబాదు జిల్లా ఎన్ని అమరుల కుటుంబాలకు 25 వేలు, ఉపాధి అవకాశాలు కల్పించారో, ఎంత మంది నిజామాబాదు జర్నలిస్ట్ సోదరులకు ఇందిరమ్మ ఇండ్లు, వారి సంక్షేమనికి ఎన్ని నిధులు కేటాయించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగుల తరుపున మండలిలో ప్రశ్నించే గొంతు వినపడాలంటే బిజెపి బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, మండల అధ్యక్షులు ఆనంద్ రావు, బీజేపీ నాయకులు వినోద్, మాస్టర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**సీఎం కు ఓటమి భయం ఉంది.**

సీఎం రేవంత్ రెడ్డి కి తమ అభ్యర్థి ఓటమి పాలవతాడని ముందే తెల్సి పోయిందని బీజేపీ జిల్లా అదుక్షుడు దినేష్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం భయంతోనే జిల్లాలు తిరుగుతూ అసత్య ప్రచారాలు చేస్తున్నాడని ఆరోపించారు. సభలకు గ్రాడ్యుయేట్స్ కాకుండా విద్యార్థులతో జరపడం శోచనీయం అన్నారు. ఈ కార్యక్రంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, అర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.



# నందిపేటలో చికెన్ మేళ.

## పెద్ద ఎత్తున హాజరైన చికెన్ ప్రియులు.

**వేగుచుక్క న్యూస్,నందిపేట, ఫిబ్రవరి 24:**



మండల కేంద్రంలో పౌల్ట్రీ బ్రీడరేస్ కోఆర్డినేషన్ అసోసియేషన్ మరియు నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కంపెనీల ఆధ్వర్యంలో సోమవారం ఫ్రీ చికెన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చికెన్ ప్రియులు పెద్ద ఏత్తున హాజరై, గత నెల రోజులుగా కనిపిస్తున్న బర్డ్ ఫ్లూ భయం నిజం కాదని తెలియజేస్తూ, చికెన్ మేళాలో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ ఇష్టానుసారంగా చికెన్ వంటకాలు ఆరగించారు. ఈ సందర్భంగా వెన్కబ్ ట్రేడర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, చికెన్ తినడం వల్ల బర్డ్ ఫ్లూ వ్యాధి సోకుతుందని ప్రజల్లో భయం నెలకొందని, ప్రజల్లో ఉన్నటువంటి భయాన్ని తొలగించడానికి కంపెనీ యజమాన్యంతో కలిసి ఫ్రీ చికెన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. చికెన్, కోడిగుడ్లను తినడం వల్ల హ్యూమినిటీ పెరుగుతుందని వైద్యులు తెలుపుతున్నారని, ఈ విషయాన్ని ప్రజలకు తెలపడానికి ఫ్రీ చికెన్ మేళా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ మేలాలో 200 కేజీల చికెన్, మరియు 2000 వేల గుడ్లను పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు. ప్రజలు భయపడకుండా చికెన్ ను గుడ్లను తిని సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చికెన్ సెంటర్ అధ్యక్షుడు అంజు చౌహాన్, శ్రీనివాస్, సాహెబ్ హుస్సేన్, గంగాధర్, ట్రేడర్స్ మండలంలోని చికెన్ సెంటర్ సెంటర్ యజమానులు పాల్గొన్నారు.

# కార్మికుల ప్రాణాల కంటే.. ఎన్నికల ప్రచారమే ముఖ్యమా?




ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం దురదృష్టకరమని మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి అన్నారు. 8 మంది కార్మికులు ఇంకా టన్నెల్లోనే చిక్కుకుని ఉన్నారని తెలిపారు. వారి ప్రాణాలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో సోమవారం నాడు జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. టన్నెల్లో చిక్కుకున్న వారంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే అయినప్పటికీ.. తెలంగాణ పునర్నిర్మాణంలో బయట రాష్ట్రాల కార్మికుల పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో దాదాపు 35 లక్షల మంది బయటి రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారని జగదీశ్ రెడ్డి తెలిపారు. కరోనా కాలంలో కార్మికులు మన రాష్ట్రం వారా.. పరాయి రాష్ట్రం వారా అనేది కేసీఆర్ చూడలేదని గుర్తుచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేవిధంగా ఎస్ఎల్బీసీ టన్నెల్లో ఉన్న ఇతర కార్మికుల ప్రాణాలను రక్షించడం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్మికులను రక్షించడంలో చేయాల్సిన పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తన అత్యంత అభ్యంతరకరంగా ఉందని అన్నారు. టన్నెల్లో చిక్కుకుపోయిన 8 మంది కార్మికుల ప్రాణాల గురించి తెలంగాణ ప్రజలు ఆతృతగా ఆరా తీస్తున్నారని.. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తోలుమందంతో వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

ఈ దుర్ఘటనపై బీఆర్ఎస్ రాజకీయాలు చేయడం లేదని జగదీశ్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రే ఓట్ల కోసం బయల్దేరి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వెళ్లలేదని తెలిపారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి మాట్లాడారని చెప్పారు తప్ప.. మోదీని రక్షణ చర్యల గురించి అడిగినట్లు ఎక్కడా వెల్లడించలేద ని అన్నారు. మీడియాకు రకరకాల లీకేజీలు ఇస్తున్నారు గానీ.. అసలు వాస్తవాలు ఏంటో వెల్లడించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. టన్నెల్ తవ్వేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని జగదీశ్ రెడ్డి అన్నారు. సీపేజీ ఆగకపోవడం వల్లే గతంలో పనులు ముందుకు సాగలేదని వివరించారు. అసలు ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు ఒక పెద్ద కుట్ర అని విమర్శించారు. నల్గొండ ప్రజలకు కృష్ణా నీళ్లు రాకుండా చేయాలని గత సమైక్య పాలకులు ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రాజెక్టును చేపట్టారని తెలిపారు. నల్గొండ కాంగ్రెస్ నేతలు నోరు మూసుకుపోవడం వల్లే ఎస్ఎల్బీసీ తెరపైకి వచ్చిందని అన్నారు. చిమ్మ చీకట్లో ఆక్సిజన్ సరిగ్గా ఇవ్వకుండా టన్నెల్లో కార్మికులతో పనులు చేయించారని తెలిపారు. తాను పాలమూరు బిడ్డను అని.. తనను కాపాడుకోవా లని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని జగదీశ్ రెడ్డి గుర్తుచేశారు.

# తెలంగాణ మహిళలకు గుడ్న్యూస్..

తెలంగాణ మహిళలకు త్వరలోనే రేవంత్ సర్కార్ శుభవార్త వినిపించనుంది. రాష్ట్రంలో కొత్త పథకాల అమలుకు సర్కార్ సిద్ధమైనట్లు తెలిసింది. ఈ మేరకు ముహూర్తం కూడా ఫిక్స్ అయినట్లు సమాచారం. మార్చి8న మహిళలకు నెలకు రూ.2500తో పాటుగా.. మరికొన్ని పథకాల అమలుకు సిద్ధమైనట్లు తెలిసింది.

తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. మహాలక్ష్మీ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో పాటుగా రూ.500కే గ్యాస్ సిలిండర్ కూడా ఇస్తోంది. మరికొన్ని పథకాల అమలుకు కూడా రెడీ అయింది. రాష్ట్రంలో తెలంగాణ మహిళలకు కొత్త పథకాల అమలుకు రేవంత్ సర్కార్ సిద్ధంది. అందుకు ముహూర్తం కూడా ఫిక్స్ చేసినట్లు తెలిసింది. ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా మార్చి 8న కొత్త పథకాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోన్నట్లు సమాచారం.

జిల్లా కేంద్రాల్లో మహిళలకు పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను ఇప్పించేందుకు ఇప్పటికే చమురు సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల రిటైర్మెంట్ ప్రయోజనాలను రూ.2 లక్షలు, రూ.లక్షలకు పెంచుతున్నట్లు ఇది వరకే ప్రకటించగా.. మార్చి 8న అధికారిక ఉత్తర్వులు వెల్లడించే ఛాన్స్ ఉంది. డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ చెక్కులు, గతంలో ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్న అభయహస్తం సొమ్ములను మహిళల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధమైంది. అలాగే అంగన్వాడీలు, సహాయ సంఘాల సభ్యులకు చీరలు అందించనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో కొన్ని గ్యారంటీలను అమలు చేస్తోంది. అయితే ఆరు గ్యారంటీల్లో ముఖ్యమైంది. మహిళలకు నెలకు రూ.2500.



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావొస్తున్న ఈ పథకం ఇంకా అమలు కాలేదు. దీంతో చాలా మంది మహిళలు నెలకు రూ.2500 పథకం కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకం అమలుపై కీలక కామెంట్స్ చేశారు. మీడియాతో చిట్ చాట్గా మాట్లాడిన ఆయన త్వరలోనే మహాలక్ష్మీ పథకం కింద మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారు. కాబట్టి మార్చి 8న ఈ పథకాన్న కూడా ప్రారంభించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# అన్నం పెట్టే రైతన్నతో కన్నీళ్లు పెట్టిస్తున్నారు..



కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొం టున్న యూరియా కష్టాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్రావు విమర్శలు గుప్పించారు. మొన్న మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే.. నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొందని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్రావు విమర్శలు గుప్పించారు. మొన్న మహబూ బాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే.. నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని రైతుల కన్నీళ్ల కడగండ్లను కాంగ్రెస్ సర్కార్ పునరావృతం చేస్తున్నదని మండిపడ్డారు.

బీఆర్ఎస్ పాలనలో రైతే రాజుగా ఉన్న తెలంగాణలో రైతన్నను నట్టేట ముంచి, నడి రోడ్డు మీదకు తెచ్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని హరీశ్రావు విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. యూరియా కోసం రైతులు మండుటెండల్లో తంటాలు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్ అని దగా చేసి, రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరుతో మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్రావు మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కంట నీరు పెట్టిస్తున్నరని అన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

వేగుచుక్క

# మీడియా ముందుకు మహేష్-జక్కన్న?

మహేష్ బాబు – రాజమౌళి కాంబోలో రూపొందుతున్న SSMB29 సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయింది. హైదరాబాద్ శివారులో ఉన్న అల్యూమినీయం ఫ్యాక్టరీలో అయితే గత కొన్ని నెలలుగా ప్రీ ప్రొడక్షన్ పనులు స్టార్ట్ అయ్యాయి. రీసెంట్‌గానే అక్కడే పూజా కార్యక్రమాలు కూడా కానిచ్చేశారు. మరి ఇప్పుడు షూటింగ్ కూడా స్టార్ట్ చేశారని అంటున్నారు. ఆ షూటింగ్ కంప్లీట్ కాబోతోందని టాక్. త్వరలోనే యూనిట్ విదేశాలకు చెక్కేస్తుందని సమాచారం. ఆ షెడ్యూల్‌కి ముందు రాజమౌళి అండ్ టీం మీడియా ముందుకు రాబోతున్నారు. ఆ సమయంలో SSMB29 సినిమాకు సంబంధించిన ప్రశ్నలన్నింటికీ సమాధానం లభించే అవకాశాలు ఉన్నాయి.

సూపర్ స్టార్ మహేష్ బాబు గత ఏడాది సంక్రాంతి కానుకగా 'గుంటూరు కారం' సినిమాతో వచ్చారు. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో చేస్తున్న మహేష్ బాబు మూవీపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో పాన్ ఇండియా రేంజ్‌ను దాటేసిన రాజమౌళి ఈసారి పాన్ వరల్డ్ మూవీని రూపొందించేందుకు గాను కాస్త ఎక్కువ సమయం తీసుకున్నారు. దాదాపు రెండేళ్ల పాటు కథ, స్క్రిప్ట్, ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేసిన రాజమౌళి అండ్ టీం ఇటీవలే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించినట్టుగా సమాచారం. సినిమా షూటింగ్ లాంఛనంగా ప్రారంభం అయినా ఇప్పటి వరకు అందుకు సంబంధించిన ఫోటోలు మాత్రం బయటకు రాలేదు. SSMB29 సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయిందనే విషయాన్ని సైతం రాజమౌళి చెప్పేందుకు రాజమౌళి ఆసక్తి చూపించలేదు. ఆ మధ్య ఒక సినిమా ఈవెంట్‌లో యాంకర్ సుమ అడిగినా విషయాన్ని రాజమౌళి దాటవేశారు. సినిమాకు సంబంధించిన అన్ని విషయాలను ఒక మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించడం రాజమౌళి అలవాటుగా వస్తుంది.

ఆర్‌ఆర్‌ఆర్ సినిమా ప్రారంభం సమయంలోనూ హీరోలు ఎన్టీఆర్, రామ్ చరణ్‌తో కలిసి రాజమౌళి మీడియా ముందుకు వచ్చారు. ఆ మీడియా సమావేశంలో సినిమా గురించి ఎన్నో విషయాలను వెల్లడించారు. అదే సమయంలో స్టోరీ లైన్ పై జనాలకు ఒక ఐడియా ఇచ్చేస్తారు.

ఇప్పుడు మహేష్ బాబుతో రూపొందిస్తున్న సినిమాకు సంబంధించిన ప్రెస్ మీట్‌కి రాజమౌళి సిద్ధం అవుతున్నారని సమాచారం అందుతోంది. హైదరాబాద్ అల్యూమీనియం ఫ్యాక్టరీలో జరుగుతున్న మొదటి షెడ్యూల్ ముగింపు దశకు చేరుకుందని టాక్. మహేష్ బాబు, ప్రియాంక చోప్రాతో పాటు ముఖ్య నటీ నటులపై గత



కొన్ని రోజులుగా షూటింగ్ జరుగుతోంది. మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుని రెండో షెడ్యూల్ కోసం ఆఫ్రికా కి వెళ్లేందుకు రాజమౌళి అండ్ టీం రెడీ అవుతున్నారని అంటున్నారు. ఆఫ్రికా వెళ్లడానికి ముందు రాజమౌళి మీడియా ముందుకు రావాలని భావిస్తున్నట్లు



సమాచారం.
మహేష్ బాబు,
ప్రియాంక చోప్రాతో కలిసి
రాజమౌళి మీడియా ముందుకు వస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఆఫ్రికా షెడ్యూల్‌ను చాలా ఎక్కువ రోజులు రాజమౌళి ప్లాన్ చేశారని తెలుస్తోంది. ఆఫ్రికా షెడ్యూల్ కంటే ముందు ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం ద్వారా సినిమాకు సంబంధించిన బజ్ క్రియేట్ చేయడంతో పాటు, లేనిపోని పుకార్లకు తెర దించినట్లు అవుతుందని రాజమౌళి భావిస్తున్నారట. త్వరలోనే %యాావీదీ%29 సినిమాకు సంబంధించిన ప్రెస్ మీట్ అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయి. మహేష్ బాబు లుక్‌తో పాటు ఇతర విషయాల గురించి రాజమౌళి ఏం చెబుతారా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు, ప్రియాంక చోప్రా కాకుండా మరో హీరోయిన్ ఈ సినిమాలో ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై కూడా రాజమౌళి స్పందిస్తారో చూడాలి.

# మజాకా ఫోక్ సాంగ్‌పై రియాక్షన్ ఇదే

అసలు ముందుపడి చేయాలని అనుకుంటున్న మనకే.. ఓ క్లారిటీ లేదు.. మనమే ఓ మాట మీద లేం.. మనమంతా కలిసి మిగతా వాళ్లని నడిపించడం అంటే కాస్త కష్టమే.. మనలో మనకే సఖ్యత కుదరడం లేదు.. ముందు మనం ఒకటి డిసైడ్ అవ్వాలి.. ముందు మీ నుంచి, మా నుంచి కొంత మంది కలిసి సందేశ్ దగ్గరకు వెళ్లి మాట్లాడాలి.. ఇక సందేశ్ నిర్ణయం మీదే మన ఈవెంట్‌ను ప్లాన్ చేద్దాం.. ఆ తరువాతే మనం ఎక్కువగా చర్చించుకుందాం..

యూట్యూబ్‌లో హిట్ అయిన ఫోక్ సాంగ్స్‌ను సినిమాల్లో వాడుతుంటారు. డీజే సాంగ్స్‌ని రీమేక్ చేసి సినిమాల్లో పెట్టుకుంటూ ఉంటారు. అయితే ఒరిజినల్ పాటలతో పోల్చితే సినిమాల్లో పెట్టుకున్న పాటల్లో ఆ ఫీల్ కనిపించదు. ఇప్పుడు సొమ్మసిల్లిపోతున్నవే అనే పాట విషయంలోనూ అదే జరిగింది. రాము రాథోడ్ పాడిన ఒరిజినల్ పాటకు వందల మిలియన్ల వచ్చాయి. ఆ వాయిస్, ఆ కంపోజిషన్ ఇలా ప్రతీ ఒక్క యాంగిల్‌లో పాట అదిరిపోయింది. మరీ ముఖ్యాంగా ఆ ఫోక్ సాంగ్‌కు రాము రాథోడ్ గాత్రం చక్కగా సరిపోయింది.



అదే పాటను ఇప్పుడు సందీప్ కిషన్ మజాకా సినిమాకు వాడుకున్నారు. కొన్ని లిరిక్స్ కూడా చేంజ్ చేశారు. రాము రాథోడ్ రాసిన ఈ పాటకు ప్రసన్న కొన్ని లిరిక్స్ యాడ్ చేసుకున్నాడు. సింగర్ రేవంత్ చేత ఈ పాటను పాడించుకున్నారు. అయితే ఈ పాటకు ఆ గాత్రానికి ఏ మాత్రం సెట్ అవ్వలేదు అని జనాలు కామెంట్లు చేస్తున్నారు. రేవంత్ వాయిస్ ఈ పాటకు న్యాయం చేయలేదంటూ యూట్యూబ్‌లో కామెంట్లు వినిపిస్తున్నాయి.

రాము రాథోడ్ వాయిస్ బాగుంది.. ఆ పాటకు అదే సెట్ అయింది.. ఈ పాటను ఇలా చేసి చెడగొట్టారు అంటూ తిట్టి పోస్తున్నారు. అందరూ సింగర్ రేవంత్ వాయిస్ మీద కంప్లైంట్స్ చేస్తున్నారు. రాము రాథోడ్ పాడిన ఒరిజినల్ వర్షనే బాగుందని ప్రశంసిస్తున్నారు. సింగర్ రేవంత్ వాయిస్ సెట్ కాలేదు.. రాము రాథోడ్ వాయిసే బాగుందని అని యూట్యూబ్‌లో ఈ పాట కింద మొత్తం ఒకే కామెంట్ కనిపిస్తోంది. ఇలా మంచి ఫీల్ ఉండే పాటల్ని చెడగొట్టకండి అంటూ నెటిజన్లు సలహాలు ఇస్తున్నారు. మరి చిత్రయూనిట్ ఇలా సింగర్‌ను ఎందుకు మార్చారో అర్థం కావడం లేదు. ఈ మజాకా చిత్రం ఫిబ్రవరి 26న రాబోతోన్న సంగతి తెలిసిందే.

# ఆగస్ట్ 1న మిరాయ్

తేజా సజ్జా మిరాయ్ రిలీజ్ డేట్‌ను మేకర్లు ప్రకటించారు. అనౌన్స్మెంట్ వీడియోతోనే మిరాయ్ మీద అంచనాలు పెరిగాయి. అయితే ఏప్రిల్‌లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తారని ఎప్పుడో ప్రకటించా రు. కానీ ఏప్రిల్‌లో కన్నప్ప, రాజా సాబ్ వంటివి వస్తున్నాయి కదా అని అంతా అనుకున్నారు. అయితే మిరాయ్ టీం ఇప్పుడు ఓ కొత్త డేట్‌ను ప్రకటించింది. ఆగస్ట్ 1న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతోన్నారట.

హను మాన్ సినిమా తరువాత తేజ సజ్జా మార్కెట్ పెరిగిందన్న సంగతి తెలిసిందే. దెబ్బకు మూడు వందల కోట్ల క్లబ్బులో జాయిన్ అయిపోయాడు. అయితే తేజ సజ్జా మాత్రం మళ్లీ ఇంత వరకు ఆడియెన్స్ ముందుకు రాలేకపో యాడు. హను మాన్ వచ్చి ఏడాది దాటిపోయింది. కానీ ఇంకో కొత్త మూవీని ప్రేక్షకుల



ముందుకు తీసుకు రాలేకపోతోన్నాడు. ఇప్పుడు గత ఏడాది తేజ సజ్జా మిరాయ్ అనే ప్రాజెక్టుని ప్రకటించాడు. ఈ ఏప్రిల్‌లో రిలీజ్ చేస్తామని ప్రకటించాడు. కానీ ఆ మూవీని ఇప్పుడు వాయిదా వేశారు. ఆగస్ట్ 1న రిలీజ్ చేస్తున్నట్టుగా ప్రకటించారు.

మిరాయ్.. సూపర్ యోధ అనే క్యాప్షన్‌తో రాబోతోంది. ఈ చిత్రంలో మంచు మనోజ్ యాంటీగా కనిపించబోతోన్నాడు. మనోజ్, తేజ సజ్జా మధ్య వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌లు అదిరిపోతాయట. ఇక తేజ సజ్జా మళ్లీ ఓ సూపర్ హీరో పాత్రలో కనిపించి మెప్పించేందుకు రెడీ అవుతున్నాడు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ మూవీ ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటోంది. ఇక త్వరలోనే షూట్ ఫినిష్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలతో బిజీగా కానున్నారు.

సినిమాటోగ్రఫర్ కార్తిక్ ఘట్టమనేని దర్శకుడిగా తన సత్తాను చాటుకున్న సంగతి తెలిసిందే. ఈగల్ మూవీతో మంచి మేకర్‌గా మార్కులు సంపాదించుకున్నాడు. ఇప్పుడు ఈ మిరాయ్ కథతో మరోసారి మెప్పించేందుకు వస్తున్నాడు. ఈ మూవీలో తేజ సజ్జాకి హీరోయిన్‌గా రితికా నాయక్ నటించింది. ఇక ఈ కొత్త పోస్టర్, ఈ రిలీజ్ డేట్ ఇప్పుడు నెట్టింట్లో బాగానే ట్రెండ్ అవుతోంది.

హనుమాన్‌తో వచ్చిన క్రేజ్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు తేజ సజ్జా. క్రేజ్ వచ్చింది కదా అని ఇష్టమొచ్చిన సినిమాలు, వచ్చిన ప్రతీ కథకు ఓకే చెప్పడం లేదనిపిస్తోంది. ఆచితూచి ప్రాజెక్టుల్ని ఎంచుకుంటున్నాడు. ఇక ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో మళ్లీ తేజ సజ్జా ఎక్కడైనా కనిపిస్తాడా? లేదా? అన్నది కూడా చూడాలి. జై హనుమాన్ మూవీలో అయితే హన్మంతు పాత్ర ఉండదని సమాచారం.

# శివ శక్తిగా తమన్నా



తమన్నా భాటియా ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా సూపర్ నేచురల్ మిస్టిక్ థ్రిల్లర్ 'ఓదెల 2'. సంపత్ నంది పర్యవేక్షణలో అశోక్ తేజ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్స్ పై నిర్మాత డి. మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాశీ మహా కుంభమేళా వేదికగా లేటెస్టుగా ఈ మూవీ టీజర్ ను మేకర్స్ విడుదల చేసారు.

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ప్రధాన పాత్రలో నటిస్తోన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల 2'. ఇది 2022లో వచ్చిన 'ఓదెల రైల్వే స్టేషన్' సినిమాకి సీక్వెల్. ఫస్ట్ పార్ట్ లో లీడ్ రోల్స్ ప్లే చేసిన హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ ఈ చిత్రంలోనూ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన తమన్నా ఫస్ట్ లుక్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. నాగ సాధు పాత్రలో ఆమె స్టన్నింగ్ లుక్ లో కనిపించింది. షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో, మేకర్స్ ప్రమోషన్స్ షురూ చేసారు. తాజాగా మూవీ టీజర్ ను రిలీజ్ చేసారు.

ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో 'ఓదెల 2' టీజర్ ను మేకర్స్ లాంచ్ చేసారు. దాదాపు రెండు నిమిషాల నిడివితో ఉన్న ఈ వీడియో మనల్ని 'ఓదెల 2' ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. 'ఓదెల రైల్వే స్టేషన్' స్టోరీ ఎక్కడ ముగిసిందో, అక్కడి నుంచే రెండో భాగం స్టార్ట్ అయినట్లు తెలుస్తోంది. వశిష్ట ఎన్ సింహా దెయ్యంగా తిరిగొచ్చిన తర్వాత, దైవ శక్తికి దుష్టశక్తుల మధ్య జరిగే యుద్ధాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నట్లు హింట్ ఇచ్చారు.

పంచ భూతాలైన భూమి, అగ్ని, నీరు, గాలి, ఆకాశం తన రూపానికి దాసోహమనే అని చెప్పడాన్ని బట్టి చూస్తుంటే.. ఈసారి దుష్టశక్తి మరింత శక్తివంతంగా తిరిగొచ్చినట్లుగా తెలుస్తోంది. నాగ సాధువుగా ఇంటెన్స్ క్యారక్టర్ లో తమన్నా భాటియా తన స్క్రీన్ ప్రెజెన్స్ తో సర్ప్రైజ్ చేసింది. ఇంతకముందెన్నడూ చూడని పవర్ ఫుల్ పాత్రలో మెస్మరైజ్ చేసింది. యాక్షన్ సీన్స్ లోనూ అదరగొట్టింది. దీని కోసం ఆమె ట్రైనింగ్ తీసుకుంది.వశిష్ట ఎన్ సింహ దుష్ట శక్తి పాత్రను పోషించగా.. హెబ్బా, పటేల్, శ్రీకాంత్ అయ్యంగార్, మురళీ శర్మ పాత్రలను కూడా పరిచయం చేసారు.

సంపత్ నంది పర్యవేక్షణలో అశోక్ తేజ 'ఓదెల 2' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగాన్ని మించి ఉండేలా భారీ బడ్జెట్ తో, హై టెక్నికల్ వాల్యూస్ తో ఈ సినిమా తీసినట్లు టీజర్ తోనే క్లారిటీ ఇచ్చారు. సినిమాటోగ్రాఫర్ సౌందర్ రాజన్ అద్భుతమైన విజువల్స్, అజనీష్ లోక్‌నాథ్ బ్యాగ్రౌండ్ స్కోర్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి. కుంభమేళా బ్యాక్ డ్రాప్ కు తగ్గట్టుగా బ్యాగ్రౌండ్ లో వినిపించే మ్యూజిక్ నెక్స్ట్ లెవల్ లో ఉంది. వీఎఫ్ఎక్స్ మీద ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు అర్థమవుతోంది. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ నిర్మాణ విలువలు కూడా బాగున్నా యి. ఓవరాల్‌గా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన 'ఓదెల 2' టీజర్ ఆకట్టుకుంటోంది. ఈ మిస్టిక్ థ్రిల్లర్‌ని పాన్ ఇండియా స్థాయిలో తెలుగు తమిళ కన్నడ మలయాళ హిందీ భాషల్లో గ్రాండ్ గా థియేటర్లలో రిలీజ్ చెయ్యాలని ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు.

# ఆమని 'నారి'కి దిల్ రాజు సపోర్ట్



మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ లభిస్తుంటుంది. తాజాగా ఆమని, ప్రగతి, మౌనిక రెడ్డి వంటి వారు ప్రధాన పాత్రలను పోషించారు. నారి ది ఉమెన్ ట్రైలర్‌ను తాజాగా దిల్ రాజు రిలీజ్ చేసి చిత్రయూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. మార్చి 7న మహిళా దినోత్సవం సందర్భంగా నారిని రిలీజ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

ప్రస్తుతం బాలికలు, అమ్మాయిలు, స్త్రీల మీద జరుగుతున్న అఘాయిత్యాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఎన్ని కఠినమైన శిక్షలు చట్టాలు విధిస్తున్నా మార్పులు రావడం లేదు. అలాంటి కీచకులకు సరైన పాఠం చెప్పేలా, ఈ అఘాయిత్యాలు జరగకుండా పరిష్కారం చూపించేలా నారి చిత్రాన్ని తీసినట్టుగా అనిపిస్తోంది. ఆమని, వికాస్ వశిష్ఠ, మౌనిక రెడ్డి, ప్రగతి, సునయన, కేదార్ శంకర్, ప్రమోదినీ, తదితరులు కీలక పాత్రల్లో నటించిన చిత్రం నారి. మహిళల్ని గౌరవించాలి, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి అనే పాయింట్‌తో సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. శ్రీమతి శశి వంటిపల్లి ఈ చిత్రాన్ని నిర్మించారు. నారి సినిమాను మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలోనే నారి ట్రైలర్‌ను దిల్ రాజు చేతులు మీదుగా రిలీజ్ చేయించారు.

ఆలోచనలు రేకెత్తించేలా, సందేశాన్నిచ్చేలా 'నారి' ట్రైలర్ మహిళల గురించి ఒక మంచి కథతో నారి తెరకెక్కించారని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోందని దిల్ రాజు అన్నాడు. నారి ట్రైలర్ చాలా బాగుందని మెచ్చుకున్నాడు. కొత్త ప్రొడ్యూసర్, డైరెక్టర్ ఇలాంటి మంచి ప్రయత్నం చేయడం సంతోషకరమని దిల్ రాజు అన్నాడు. ఆమని గారు మావిచిగురు, శుభలగ్నంలాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు గుర్తుండిపోయారని అన్నాడు. అలాగే తమ సంస్థలో ఎంసీఏ, శ్రీనివాస కల్యాణం చిత్రాల్లో నటించారని గుర్తు చేసుకున్నాడు. నారి సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ తెలిపాడు.

నారి సినిమా ట్రైలర్‌ను దిల్ రాజు రిలీజ్ చేయడం ఆనందంగా ఉందని ఆమని అన్నారు. వారి బ్యానర్లో తాను శ్రీనివాస కల్యాణం, ఎంసీఏ లాంటి చిత్రాల్ని చేశానని గుర్తు చేసుకున్నారు. మహిళల గొప్పదనం చెప్పేలా తమ దర్శకుడు సూర్య వంటిపల్లి నారి చిత్రాన్ని రూపొందించారని తెలిపింది. ఇంతమంచి రోల్ చేసే అవకాశం ఇచ్చిన సూర్యకి థ్యాంక్స్ అని ఆమని చెప్పింది. ప్రతి మహిళ చూడాల్సిన చిత్రమిదని చెప్పుకొచ్చింది. ఈ చిత్రం మహిళా దినోత్సవం సందర్భంగా రిలీజ్ కాబోతోందని ఆమని తెలిపింది.

# ఎవడే సుబ్రహ్మణ్యం రీ రిలీజ్..

టాలీవుడ్‌లో రీ రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్న విషయం తెల్సిందే. మొన్న వాలంటైన్స్ డే సందర్భంగా మూడు సినిమాలు రీ రిలీజ్ అయ్యాయి. మార్చి 7న 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమా రీ రిలీజ్ కాబోతున్న విషయం తెల్సిందే. తాజాగా 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా రీ రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. సినిమా విడుదలై 10 ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో మార్చ్ 21న 'ఎవడే సుబ్రమణ్యం' సినిమాను రీ రిలీజ్ చేయబోతు న్నారు. నాని, విజయ్ దేవరకొండ నటించగా కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు.

తెలుగు సినిమా పరిశ్రమలో గత ఏడాది పదుల కొద్ది సినిమాలు రీ రిలీజ్ అయ్యాయి. కొన్ని సినిమాలు సంచలన వసూళ్లు నమోదు చేసి రికార్డులు సృష్టించిన విషయం తెల్సిందే. అదే ట్రెండ్ ఈ ఏడాది కొనసాగనుంది. ఇప్పటికే వాలంటైన్స్ డే సందర్భంగా ఆరంజ్, సూర్య సన్నాఫ్ కృష్ణన్, కృష్ణ అండ్ హిజ్ లీలా సినిమాలు రీ రిలీజ్ అయ్యాయి. వాటికి యూత్ ఆడియన్స్ నుంచి మంచి స్పందన దక్కింది. డీసెంట్ వసూళ్లు రాబట్టాయి. వచ్చే నెలలో మహేష్ బాబు, వెంకటేష్ కలిసి నటించిన 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాను రీ రిలీజ్ చేయబోతున్నారు. మార్చ్ 7న తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక స్క్రీన్స్‌లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు రీ రిలీజ్ కానున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది.

ఇదే సమయంలో మరో రీ రిలీజ్ ప్రకటన వచ్చింది. నాని హీరోగా విజయ్ దేవరకొండ ముఖ్య పాత్రలో నటించిన 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా విడుదల అయ్యి 10 ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో మార్చ్ 21న రీ రిలీజ్‌కి ప్లాన్ చేశారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ వైజయంతి మూవీస్ అధికారి కంగా ప్రకటించింది. గత ఏడాది కల్కి 2898 ఏడీ సినిమా ను రూపొందించి దాదాపుగా వెయ్యి కోట్ల రూపాయల వసూళ్లను సొంతం చేసుకున్న దర్శకుడు నాగ్ అశ్విన్ మొదటి సినిమా



ఎవడే సుబ్రమణ్యం అనే విషయం తెల్సిందే. కమర్షియల్‌గా ఆ సమ యంలో సినిమా పెద్ద నెంబర్స్ నమోదు చేయకున్నా విమర్శకుల ప్రశంసలు దక్కించు కుంది. ఆ సినిమా కారణంగానే విజయ్ దేవరకొండకి మంచి ఆఫర్లు లభించాయి. నాని, విజయ్ దేవరకొండతో పాటు సినిమాలో మాళవిక నాయర్ నటించి మెప్పించింది. ఈ ముగ్గురి నటనతో ఎవడే సుబ్రమణ్యం సినిమా స్థాయిని ఎక్కడికో తీసుకు వెళ్లారు. ఈ సినిమాలోని కీలక సన్నివేశాలు ఎవరెస్టు పర్వతంపై చిత్రీకరించారు. ఎవరెస్టు శిఖరంపై చిత్రీకరణ జరుపుకున్న తొలి తెలుగు చిత్రంగా ఈ సినిమా చరిత్రకె క్కింది. దూద్ కాశిని సైతం అద్భుతంగా చూపించారు. యూత్ ఆడియన్స్ ఎక్కువగా దూద్ కాశి గురించి మాట్లాడుకునేలా చేశారు. విభిన్నమైన సినిమాగా ఎవడే సుబ్రమణ్యం సినిమా నిలిచింది. నాగ్ అశ్విన్ వంటి దర్శకుడిని ఆ సినిమా ఇచ్చింది. అప్పుడే ఆ సినిమా వచ్చి పదేళ్లు కావస్తుంది. దశాబ్ద కాలం పూర్తి చేసుకోబోతున్న నేపథ్యంలో రీ రిలీజ్‌కి ప్లాన్ చేశారు.

ఆ సినిమా వచ్చినప్పుడు విజయ్ ఎవరో తెలీదు.. అంతగా ఫ్యాన్ బేస్ లేదు. కానీ ఇప్పుడు విజయ్ ఓ బ్రాండ్ అయ్యాడు. నాని కంటే విజయ్ సీన్లకు ఫ్యాన్స్ ఎక్కువ సందడి చేస్తారేమో. దీంతో మళ్లీ నాని, విజయ్ ఫ్యాన్ వార్ స్టార్ట్ అవుద్దేమో అని అంతా అనుకుంటున్నారు.

# టీవీ ప్రీమియర్ డేట్ వచ్చేసింది!




సంక్రాంతి పండుగ సందర్భంగా థియేటర్ల లో విడుదలైన ఈ చిత్రం.. బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. వరల్డ్ వైడ్ గా రూ.300 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. ఇక ఈ సినిమా డిజిటల్ స్క్రీన్ మీదకి ఎప్పుడెప్పుడు వస్తుందా అని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ఓటీటీలో కాకుండా, ముందుగా బుల్లి తెర మీదకి తీసుకొస్తున్నారు. తాజాగా టెలివిజన్ ప్రీమియర్ డేట్ ను ప్రకటించారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా డిజిటల్ అండ్ శాటిలైట్ హక్కుల ను జీ గ్రూప్ సొంతం చేసుకుంది. జీ తెలుగు ఛానల్ లో మార్చి 1న సాయంత్రం 6 గంట లకుగా ఈ మూవీని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా టెలికాస్ట్ చేయబోతున్నట్లు అఫీషియల్ గా అనౌన్స్ చేసారు. ఓటీటీల హవా పెరిగిపోయిన తర్వాత, థియేటర్లలో రిలీజైన సినిమాలు వెంటనే డిజిటల్ ఫ్లాట్ ఫామ్స్‌లోకి వచ్చేస్తున్నాయి. ఈ రోజుల్లో ఎంత పెద్ద బ్లాక్ బస్టర్ సినిమా అయినా ఐదు నుంచి ఎనిమిది వారాల్లో ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. వెంకీమామ సినిమా కూడా ఇలానే ఓటీటీలో వస్తుందని ఫ్యాన్స్ భావించారు. కానీ ఎవరూ ఊహించని విధంగా టీవీలో ప్రసారం చేస్తున్నారు. ఓటీటీలు వచ్చిన తర్వాత శాటిలైట్ రైట్స్ బాగా పడిపోయాయి. ఏ సినిమాకి కూడా ఆశించిన టీఆర్పీ రేటింగ్ రావడం లేదు. స్టార్ హీరోల చిత్రాలకు సైతం తక్కువ టీఆర్పీ నమోదవుతోంది.